క్లుప్తంగా

ఘనంగా ఓలేరు తిరునాళ్ల మహోత్సవాలు



ఓలేరు(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం ఓలేరు గ్రామంలో వేంచేసి యున్న శ్రీ ఓలేటమ్మ అమ్మవారి తిరునాళ్ల మహోత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి గ్రామస్తులు మొక్కుబడులు చెల్లించుకుని పొంగళ్ళు సమర్పించారు. అమ్మవారి సన్నిధికి వెంకట్రాజునగర్, ఓలేరు నుంచి ప్రభలు వచ్చాయి. ఓలేరు గౌడపాలెం నుంచి చిన్నారులు ప్రభను కట్టుకుని అమ్మవారి సన్నిధికి తీసుకువచ్చారు. పూజా కార్యక్రమాలు, తిరునాళ్లను నిర్వాహకుడు బేతపూడి రజనీకాంత్ అత్యంత వైభవంగా నిర్వహించారు.

నేత్రానందంగా కట్లమ్మతల్లి ఉత్సవాలు



వెల్లటూరు(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం వెల్లటూరు గ్రామంలో కొలువైన శ్రీ కట్లమ్మతల్లి 26వ వార్షిక మహోత్సవాలలో భాగంగా బుధవారం అమ్మవారిని నిత్యపూజ అనంతరం పావన నదీస్నానం గావించారు. మేళతాళాలు, కనకతప్పెట్ల మధ్య పవిత్ర కృష్ణా నదీ జలాల్లో వేద బ్రాహ్మణులు క్రోవి రామకృష్ణ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి గ్రామోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. భక్తులు అమ్మవారికి దివ్య నీరాజనాలు సమర్పించి తమ భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. కార్యక్రమాన్ని కట్లమ్మ దేవస్థాన అభివృద్ధి కమిటీ పర్యవేక్షించింది.

వైభవంగా నరసింహ స్వామి జయంతి



జంపని(వేమూరు): మండలంలోని జంపని గ్రామంలో నరసింహ స్వామి జయంతి బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ సీతా రామాంజనేయ కల్యాణ మండప ప్రాంగణంలో ఆగమ శాస్త్రం ప్రకారం లక్ష్మీ నరసింహస్వామి పూజలు నిర్వహించారు. అర్చకులు శ్రీనివాసమూర్తి అధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. పాముల పాటి శివ రామ కృష్ణ దంపతులు, ప్రధాన దాతలు పాల్గొన్నారు. మహిళా భక్తులు విష్ణు సహస్ర నామ పారాయణ, గోవింద నామ సంకీర్తన చేశారు.

భక్తి శ్రద్ధలతో మద్దిరాలమ్మ గ్రామోత్సవం



నగరం: మండలంలోని వెలమవారిపాలెం గ్రామంలో శ్రీమద్దిరాలమ్మ అమ్మవారి గ్రామోత్సవం బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు.అమ్మవారి ఘటాలను ఆలయ పూజారులు సంప్రదాయ బద్ధంగా గ్రామాలలో ఊరేగించారు. భక్తులు అమ్మవారికి విశేష పూజలు చేశారు. గ్రామోత్సవం అనంతరం అమ్మవారి ఘటాలను గురువారం ఆలయంలో పునః ప్రవేశ పెట్టనున్నట్లు అలయ ఈవో రాజేశ్వరావు తెలిపారు. గురువారం అమ్మవారి తిరునాళ్ల మహోత్సవం జరుగుతుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

విద్యాదీవెనతో విద్యార్థుల భవితకు భరోసా



సమావేశానికి హాజరైన వెల్ఫేర్ అసిస్టెంట్లు

- సాంఘిక సంక్షేమశాఖ జిల్లా అధికారి రాజ డెబోరా
- రేపల్లె, వేమూరు నియోజకవర్గాల సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లకు పథకం అమలుపై అవగాహన

రేపల్లె రూరల్: కుటుంబంపై ఆర్థిక భారం పడకుండా విద్యార్థులు చదువులు కొనసాగించేందుకు జగనన్న విద్యాదీవెన ఎంతగానో ఉపయోగ పడుతుందని సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారి రాజడెబోరా అన్నారు. రేపల్లె, వేమూరు నియోజకవర్గాల్లోని సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లకు జగనన్న విద్యా దీవెన పథకం అమలుపై పట్టణంలోని ఎస్టీ బాలుర వసతి గృహంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థులకు ఈ పథకం ఉపయోగ పడుతుందన్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన విద్యార్థుల నగదు సొమ్మును నేరుగా వారి తల్లుల ఖాతాలలో జమ చేయటం జరుగుతుందన్నారు. బీసీ, ఓసీ కులానికి చెందిన విద్యార్థులు తమ వ్యక్తిగత అకౌంటుతో పాటు తల్లుల అకౌంట్ వివరాలను విధిగా అందించాల్సి ఉంటుందన్నారు. జాయింట్ అకౌంట్‌లో మాత్రమే ఉపకారవేతనం సొమ్మును జమచేయటం జరుగుతుందని సూచించారు. ఈ అంశాన్ని విద్యార్థులకు, వారి తల్లులకు వెల్ఫేర్ అసిస్టెంట్‌లు విధిగా తెలియజేయాలన్నారు. ఇంటర్ పూర్తి చేసిన అనంతరం చదువులు కొనసాగించే విద్యార్థులకు ఈ పథకం వర్తిస్తుందన్నారు. పథకం అమలులో లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను గ్రామస్థాయిలోనే గుర్తించి పరిష్కరించాలన్నారు. గత విద్యా సంవత్సరంలో తల్లుల ఖాతాలలో నగదు జమ కాని విద్యార్థులు ఎవరైనా ఉంటే సమస్యను పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. సమావేశంలో అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ అధికారి సత్యనారాయణ, వెల్ఫేర్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెల్ఫేర్ అధికారి రాజ డెబోరా

అంగరంగ వైభవంగా దివ్య జంట రథోత్సవాలు



పురవీధుల్లో ఊరేగుతున్న దివ్య జంట రథోత్సవాలు



రథోత్సవంలో బాణసంచా వెలుగులు

- పురవీధుల్లో మార్మోగిన మార్కండేయ, భావనారుషి నామ స్మరణ
- జంట రథోత్సవాలను వీక్షించేందుకు తరలి వచ్చిన భక్తజనం

ఐలవరం(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం ఐలవరంలో కొలువైన మార్కండేయ ఈశ్వర భద్రావతి సమేత భావనారుషి స్వామి, భద్రావతి సమేత భావనారుషి స్వామి వార్ల కల్యాణ మహోత్సవాలలో భాగంగా బుధవారం రాత్రి దివ్య జంట రథోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగాయి. ఈ సందర్భంగా కల్యాణ మూర్తులైన స్వామి వార్లను పురవీధుల్లో ఊరేగించారు. హోమం, బలిహరణ అనంతరం రథోత్సవాలు ముందుకు సాగాయి. భక్తులు అడుగడుగునా స్వామి వార్లకు బ్రహ్మరథం పట్టారు. స్వామి వార్ల దివ్య జంట రథోత్సవాలను వీక్షించేందుకు భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు. కల్యాణ మహోత్సవాలు పురస్కరించుకుని ప్రతి ఇంటా పండుగ వాతావరణం నెలకొంది. జంట దివ్య రథాలు ఒక్కసారిగా ఎదురెదురుగా రావడంతో భక్తులు దిక్కులు పిక్కటిల్లేలా జై మార్కండేయ..జై భావనారుషి అంటూ నామస్మరణ చేశారు. బాణా సంచా వెలిగించారు. ఈ కార్యక్రమం ఎంతగానో ఆకట్టుకుంది. రథోత్సవంలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ట్రాన్స్‌కో ఏడీఏ ఏఈ ఏడుకొండలు ఆధ్వర్యంలో విద్యుత్ సిబ్బంది ప్రత్యేక చర్యలు చేపట్టారు. భట్టిప్రోలు ఎస్ఐ కాసుల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

వీరాంజనేయునికి సిందూర లేపన పూజ



వీరాంజనేయునికి సిందూర లేపన పూజ నిర్వహిస్తున్న అర్చకులు

జంపని(వేమూరు): మండలంలోని జంపని గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో వార్షిక హనుమజ్జయంతి ఉత్సవాలను బుధవారం ప్రారంభించారు. తొలి రోజున విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచన, స్వామి వారికి పంచామృత అభిషేకం జరిపి మూల విరాట్టుకు సిందూర లేపన పూజ జరిపారు. పండిత దీవి లక్ష్మీ నరసింహాచార్యులు పర్య వేక్షణలో నిర్వహించిన క్రతువులో అర్చకులు శ్రీనివాసమూర్తి పంచ సూక్తం, మన్య సూక్తం పారాయణ నిర్వహించారు. సాయంత్రం స్వామి వారికి అష్టోత్తర శత నామాలు, సహస్ర నామాలతో గులాబీ పుష్ప పూజ జరిపారు. అంజనేయ భక్త సమాజం వారు హనుమాన్ చాలీసా పారాయణ జరిపి భజన కీర్తనలు ఆలపించారు. పల్లకీ ఉత్సవం జరిపారు. చల్లగుండ్ల చిన్న బంగారు బాబు, గుంటూరు వెంకట్రావు, తలశిల గంగాధరరావు, గాదెంశెట్టి వెంకట సూర్యనారాయణ, చల్లగుండ్ల నారాయణరావు దంపతులు ఉత్సవ దాతలుగా వ్యవహరించారు. అర్చకులు అగ్ని హోత్రం చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఘనంగా కాళికాంబ ఆలయ వార్షికోత్సవం



కర్లపాలెం: కాళికాంబ సమేత వీరభద్ర స్వామి ఆలయ 14వ వార్షికోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. మండల కేంద్రం కర్లపాలెం సెంటర్‌లోని గ్రామదేవత కాళికాంబ సమేత వీరభద్ర స్వామి నూతన ఆలయ ప్రతిష్ట సందర్భంగా భక్తులు తమ తమ గృహాల నుంచి మంగళ వాయిద్యాలతో జలబిందెలతో కాళికాంబ ఆలయానికి చేరుకుని అభిషేకాలు నిర్వహించారు. బుధవారం సాయంత్రం ఏట్రవారిపాలెం గ్రామంలోని గ్రామదేవత రెడెంకమ్మ అమ్మవారి ఆలయం వద్ద నుంచి పసుపు బండ్లపై కాళికాంబకు పట్టు వస్త్రాలను ఊరేగింపుగా తీసుకువచ్చి సమర్పించారు. పూజా కార్యక్రమాలలో భక్తులు కుంచాల సాంబిరెడ్డి, కట్టా సుజాత, కొక్కిలిగడ్డ రామరాజు, కె.నాగవర్ధన్‌రెడ్డి, దుర్గా ప్రసాద్, యాసిన్, భక్తులు పాల్గొన్నారు.

గుండి పార్వతి అమ్మవారి తిరునాళ్ల ప్రారంభం



ఘటం కుండతో గ్రామోత్సవంలో పాల్గొన్న భక్తులు



తిరునాళ్లలో పాల్గొన్న చిన్నారులు

భట్టిప్రోలు: భట్టిప్రోలు హిందూ శ్మశాన వాటికలో కొలువైన శ్రీ గుండి పార్వతి అమ్మవారి తిరునాళ్ల మహోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాలలో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిగాయి. పూజా కార్యక్రమాలను అర్చకులు భట్టిప్రోలు కార్తికేయశర్మ శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని తమ భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. అమ్మవారిని ఘటం కుండతో గ్రామోత్సవం గావించారు. భక్తులు అమ్మవారి సన్నిధికి పసుపు బళ్ల తీసుకు వచ్చి గ్రామోత్సవంలో పాల్గొన్నారు. భట్టిప్రోలు గ్రామ దేవత శ్రీ దండిపార్వతి అమ్మవారి సహోదరి ఐన శ్రీ గుండి పార్వతి అమ్మవారికి ప్రతి ఏటా ఘనంగా పూజలు నిర్వహిస్తుంటారు. గురువారం అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి భక్తులు ప్రభలను కట్టుకుని అమ్మవారి సన్నిధికి తీసుకు వస్తారు. తమ మొక్కుబడులు చెల్లించుకుంటారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు జరగనున్నాయని నిర్వాహకులు తెలిపారు.



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



కోడిపర్రు గ్రామంలో పారిశుద్ధ్య పనులు

కోడిపర్రు(వేమూరు): అల్ప పీడన ప్రభావం వల్ల కురిసిన వర్షాలకు గ్రామాల్లో నిలిచిన నీటిని బయటకు తరలించేందుకు చర్యలు తీసుకోవడం జరిగిందని ఎంపీడీవో జీ వీ శేషగిరిరావు తెలిపారు. వేమూరు మండలంలోని కోడిపర్రు గ్రామంలో బుధవారం పారిశుద్ధ్య పనులు చేపట్టడం జరిగిందన్నారు. గ్రామంలో నిలిచిపోయిన సైడ్ డ్రెయిన్‌లోని పూడిక తొలగించేందుకు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. పారిశుద్ధ్య నిర్వహణపై పంచాయతీ కార్యదర్శులు నిర్లక్ష్యం చేయరాదన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పిల్లి సామ్రాజ్యం, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బడి బయట విద్యార్థుల గుర్తింపునకు సర్వే



వేమూరు: బడి బయట ఉన్న విద్యార్థినీ విద్యార్థులను బడిలో చేర్పించడం జరుగుతుందని మండల విద్యాశాఖాధికారి ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. వేమూరు మండలంలోని 0–18 సంవత్సరాల లోపు బాలికలు, బాలురు, బడి బయట ఉన్న విద్యార్థులను బడిలో చేర్పించేందుకు బుధవారం ప్రత్యేక క్యాంపు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఇన్‌క్లోజ్ ఎడ్యుకేషన్ రిసోర్సు పర్సన్ ఎన్ విజయలక్ష్మి, వేల్పుల మోహన రావు ఇంటింటి సర్వే నిర్వహించారు. మండలంలో ప్రత్యేక అవసరాలు గల బాల బాలికల తల్లిదండ్రులకు విద్య యొక్క ఆవశ్యకత గురించి తెలియజేశారు.

లైబ్రరీలో వేసవి శిక్షణ తరగతులు



పిల్లలకు జీవిత చరిత్రలను వినిపిస్తున్న రమాదేవి

తెనాలి: స్థానిక నెహ్రూరోడ్డులోని శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా బుధవారం నీతికథలు, మహనీయుల జీవిత విశేషాలను వినిపించారు. వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవటం, పాఠశాల స్థాయి నుండే విద్యార్థుల్లో గ్రంథాలయాన్ని సందర్శించటం, చదివే అలవాటును పెంపొందించటం తరగతుల ముఖ్య ఉద్దేశ్యంగా గ్రేడ్–1 లైబ్రేరియన్ కె.రమాదేవి తెలియజేశారు. ప్రతిరోజు ఉదయం 8 గంటల నుంచి 11.30 గంటల వరకు జరిగే ఉచిత శిక్షణ శిబిరాన్ని 6–10 తరగతుల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మినరల్ వాటర్ అందుబాటులో ఉందనీ, విరామ సమయంలో అల్పాహారం ఇస్తున్నట్లు తెలిపారు. పుస్తకాలు చదివించటం, శతక పద్యాలు నేర్పించటంతోపాటు చేతిరాతలో శిక్షణ, ఇండోర్ గేమ్స్ ఆడిస్తామని కూడా వివరించారు. తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులను గ్రంథాలయానికి వచ్చేలా సహకారం అందించాలని విజ్ఞప్తిచేశారు. పట్టణానికి చెందిన అంకినీడు ప్రసాద్ రూ.2800 విలువ గల 1969 నుంచి 2012 వరకు వచ్చిన చందమామ కథలు పుస్తకాలను లైబ్రరీకి విరాళంగా ఇచ్చినట్టు తెలిపారు.

జీవ వైవిధ్య రక్షణకు కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న అవగాహన సంస్థ సభ్యులు

లక్ష్మీపురం: జీవవైవిద్యాన్ని జాతీయ సంపదగా భావించాలని అవగాహన సంస్థ సభ్యులు పేర్కొన్నారు. అరండల్‌పేటలోని సంస్థ కార్యాలయంలో మంగళవారం ప్రపంచ జీవవైవిద్య దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో పరార్యవరణ ప్రచారకులు వి.సత్యనారాయణ మాట్లాడుతూ మానవునికి జీవ వైవిద్యానికి అవినాభావ సంబంధం ఉందన్నారు. పెరుగుతున్న జనాభా, పట్టణీకరణ, పారిశ్రామికీకరణ వలన సహజవనరులపై తీవ్ర ఒత్తిడి పెరిగి భూగోళం కాలుష్యానికి గురవుతోందన్నారు. మానవుడు అభివృద్ధి పేరుతో ప్రకృతిని అనేక విధాలుగా ధ్వంసం చేస్తున్నారన్నారు. ఫలితంగా అసంఖ్యాక జంతు, వృక్ష జాతులు అంతరించి పోతున్నాయన్నారు. విశ్రాంత జంతుశాస్త్ర శాఖాధిపతి డాక్టర్ ఆర్.రామచంద్రరావు మాట్లాడుతూ 21వ శతాబ్దంలో పర్యావరణ విధ్వంసం, జీవజాతుల నష్టం పట్ల ప్రపంచ దేశాలన్ని ఆందోళన వెలిబుచ్చాయన్నారు. పటిష్టమైన చట్టాలతోనే జీవవైవిద్య మనుగడ సాధ్యమవుతోందన్నారు. విద్యావేత్త ముప్పాళ్ల ప్రసాదరావు, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్టీఐ కమిషనర్‌కు అభినందన



ఆర్టీఐ కమిషనర్ చావలి సునీల్‌ను అభినందిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

భట్టిప్రోలు: ఆర్టీఐ కమిషనర్(ఏపీ)గా ఇండియా ఫ్రొబాల్ మాజీ టీమ్ కెప్టెన్, రియల్‌స్టార్ అవార్డు గ్రహీత చావలి సునీల్ నియమితులు కావడం పట్ల ఎమ్మార్పీఎస్ నాయకులు బుధవారం మంగళగిరిలోని ఆయన కార్యాలయంలో కలిసి అభినందనలు తెలిపారు. ఆయనను కలసిన వారిలో ఎమ్మార్పీఎస్ నాయకులు నన్నెపాముల నాగేశ్వరరావు, పేరం ఆదివిష్ణు, కంభంపాటి వెంకటేష్, కటికల కళాకరరావు, పాలిపోగు ఏసురత్నం తదితరులు ఉన్నారు.

శ్రీలక్ష్మీ నృసింహస్వామికి అష్టోత్తర కలశాభిషేకం

తెనాలి: పట్టణ నాజరుపేటలోని శ్రీలక్ష్మీ నృసింహస్వామి దేవస్థానంలో స్వామివారి జయంతి ఉత్సవాల్లో భాగంగా బుధవారం 108 కలశాల పానకంతో అభిషేకం నిర్వహించారు. శ్రీశృంగేరి శ్రీవిరూపాక్ష శ్రీ పీఠపాలిత పరశివానంద భారతి స్వామి చేతుల మీదుగా ఈ వేడుకను జరిపించారు. పరశివానంద భారతి స్వామి భక్తుల నుద్దేశించి మాట్లాడుతూ తన భక్తుడైన ప్రహ్లాదుడిను రక్షించటం కోసం మహావిష్ణువు నరసింహ స్వామిగా అవతరించినట్టు చెప్పారు. రాక్షసుడైన హిరణ్యకశ్యపుడిని సంహరించి, తన భక్తుడికి అభయమిచ్చినట్టు తెలిపారు. నృసింహ జయంతి సందర్భంగా స్వామి వారిని దర్శించుకుంటే జన్మ జన్మ పాపాలు తొలగిపోతాయని చెప్పారు. నృసింహస్వామి నాజరుపేటలో 1906లో వెలిశారని, స్వామిని దర్శించుకోవటం స్థానిక ప్రజల అదృష్టమన్నారు. ఆలయ కమిటీ ఛైర్మన్ కె.చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ జూన్ ఒకటో తేదీన శ్రీ హనుమత్ జయంతి, జూన్ 5న శ్రీలక్ష్మీ నృసింహస్వామి కళ్యాణ మహోత్సవం అనంతరం అన్నసమారాధన జరుగుతుందని తెలియజేశారు. భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేసి స్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు. కార్యక్రమాన్ని విజయకుమారి, శ్రీలక్ష్మి, ఆలయ పూజారి భార్గవ్ పర్యవేక్షించారు.